APTEL/2009/29308

స్నేహిత
# ఎక్స్‌ప్రెస్

నిజం దాగదు.. వార్త ఆగదు

తెలుగు దినపత్రిక

29-04-2026
బుధవారం
హైదరాబాద్
సంపుటి: 17 । సంచిక: 185
పేజీలు: 04 । వెల: 5/-
ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్

FOLLOW:
https://epaper.expresstelugudaily.com



2

మోడీ రాకతో తెలంగాణలో
## రాజకీయ మార్పు





“

ఫ్యూచర్ సిటీ కోసం స్థానిక రైతులు భూములు ఇచ్చి సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఫ్యూచర్ సిటీకి భూమి ఇచ్చిన రైతులను ఆదుకుంటామని రైతులు ఆనందంగా పరిహారం తీసుకోవాలన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా మీర్ ఖాన్ పేట్‌లో ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ కార్యాలయానికి భూమి పూజ నిర్వహించిన సీఎం అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు.

### ఆదర్శ నగరాలతో పోటీపడేలా
# ఫ్యూచర్‌సిటీ

ప్రజాప్రతినిధులు ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

భవిష్యత్ తరాలకు అద్భుత నగరంగా ఇది విలసిల్లుతుంది

ఫ్యూచర్ సిటీ పరిధి గ్రామాల సర్పంచ్‌ల వివరాలు తెప్పించుకోవాలి

- ఆయా గ్రామాల్లో సభలు పెట్టి తీర్మానాలు చేసి.. కలెక్టర్, మంత్రికి పంపాలి
- ఆయా గ్రామాలను ఫ్యూచర్ సిటీలో భాగం చేసే చర్యలు చేపడతాం
- గ్లోబల్ సమిట్ ద్వారా ప్రపంచానికి విశ్వాసం కలిగింది
- జూన్ 2లోగా ఫ్యూచర్ సిటీ కార్యాలయం ప్రారంభించేలా చూడాలి
- ఫ్యూచర్ సిటీకి భూములిచ్చే రైతులను ఆదుకునే బాధ్యత తీసుకోవాలి
- చట్టపరంగా నోటిఫికేషన్లు, న్యాయపరమైన ప్రక్రియ ఇప్పటికే పూర్తి అయ్యింది
- అభివృద్ధికి భూములిచ్చిన రైతులను గౌరవించాలి ○ సీఎం రేవంత్ రెడ్డి





2

# తెలంగాణ డీజీపీగా సీవీ ఆనంద్

నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేయనున్న శివధర్‌రెడ్డి

1991 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సీవీ ఆనంద్

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా సీవీ ఆనంద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత డీజీపీ శివధర్‌రెడ్డి ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేయనున్నారు. 1991 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సీవీ ఆనంద్ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పదవి నుంచి బదిలీ అయ్యారు. హెడ్ ఆఫ్ పోలీస్ ఫోర్స్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా రెండు విడతల్లో సేవలు అందించారు.ఇటీవలే యూపీఎస్సీ డీజీపీ పోస్టుకు అర్హులైన ఐపీఎస్‌ల జాబితాను తెలంగాణ ప్రభుత్వానికి పంపించిన సంగతి తెలిసిందే. అందులో సీవీ ఆనంద్‌తోపాటు 1994 బ్యాచ్‌కు చెందిన వినాయక్ ప్రభాకర్ ఆప్టే, సౌమ్యమిశ్రా ఉన్నారు. ఈ ముగ్గురిలో అత్యంత సీనియర్ అయిన సీవీ ఆనంద్‌ను డీజీపీగా ప్రభుత్వం నియమించింది.



# మహిళా రిజర్వేషన్లపై మా పోరాటం ముగిసిపోలేదు

చట్టాన్ని అమలు చేసే వరకు పోరాడుతూనే ఉంటాం

- ఈ బిల్లును తేవడానికి చేస్తున్న ప్రయత్నాల్లో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదు
- ప్రతిపక్షాల నీచ రాజకీయాల వల్లే అమలు ఆగిపోయింది
- మహిళలు అసెంబ్లీలు, పార్లమెంట్‌లకు రావడం ప్రతిపక్షాలకు ఇష్టం లేదు
- రెండు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రారంభించిన ప్రధాని
- వారణాసి-పుణె, అయోధ్య-ముంబయి మార్గాల్లో అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు



2

## ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి

- ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా సాగాలి
- రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి
- ప్రతి కేంద్రాన్ని అధికారులు పర్యవేక్షిస్తూ సమస్యలు వెంటనే పరిష్కరించేలా చూడాలి
- గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా మిషన్ భగీరథ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్

2

## ప్రపంచ వైద్య పర్యాటక కేంద్రంగా హైదరాబాద్

- ఆవిధంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేయాలి
- ఇకపై ప్రతి సంవత్సరం ఒక మెడికల్ టూరిజం ఈవెంట్‌ను నిర్వహించాలి
- ఈ ఏడాది జూన్‌లో మొదటి ఈవెంట్ నిర్వాహణకు ఏర్పాట్లు చేయాలి
- మెడికల్ టూరిజంలో ఉన్న ప్రైవేటు సంస్థలను సైతం ఈవెంట్‌లో భాగస్వామ్యం చేయాలి
- ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



2

## విలేకరులు కావలెను

స్నేహిత
ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
expresstelugudaily.com

Contacts
తెలంగాణ
95500 21491

ఆంధ్రప్రదేశ్,
తెలంగాణ రాష్ట్రాల్లో

ఎక్స్‌ప్రెస్ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌-చార్జ్‌లు మండల రిపోర్టర్లు, యాడ్స్ ఏజెంట్స్ వెంటనే కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు..

# ఆదర్శ నగరాలతో పోటీపడేలా ఫ్యూచర్‌సిటీ



**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో అక్కడి ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. భవిష్యత్ తరాలకు అద్భుత నగరంగా ఫ్యూచర్ సిటీ విలసిల్లుతుందని పేర్కొన్నారు. సర్పంచ్‌లు, కార్పొరేటర్లు ప్రభుత్వానికి సహకరిస్తేనే సమస్యలు వేగంగా పరిష్కారమవుతాయన్నారు. ప్రభుత్వ అధికారిక కార్యక్రమం జరిగితే ఫ్యూచర్ సిటీ పరిధి గ్రామాల ప్రజాప్రతినిధులకు పాస్ పంపాలని పోలీసులకు సూచించారు. కొంతమంది తమ గ్రామాలను ఫ్యూచర్ సిటీలో కలపాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారని, ఆయా గ్రామాల్లో సభలు పెట్టి తీర్మానాలు చేసి కలెక్టర్, మంత్రికి పంపాలని తెలిపారు. ఆయా గ్రామాలను ఫ్యూచర్ సిటీలో భాగం చేసే చర్యలు చేపడతామని, ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దాలనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నాలుగో నగరంగా ఫ్యూచర్‌సిటీని తీర్చిదిద్దాలనుకుంటున్నామని, ఆదర్శ నగరాలతో పోటీపడేలా ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దాలని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఫ్యూచర్ సిటీకి వచ్చే పెట్టుబడుల ఒప్పందాలు ఇక్కడే జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. జూన్ 2లోగా ఫ్యూచర్ సిటీ కార్యాలయం ప్రారంభించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఫ్యూచర్ సిటీలో నిర్వహించిన గ్లోబల్ సమిట్ ద్వారా ప్రపంచానికి విశ్వాసం కలిగిందన్న సీఎం సైబరాబాద్, హైటెక్ సిటీ, ఓఆర్ఆర్, విమానాశ్రయ నిర్మాణం మన కళ్ల ముందే అభివృద్ధి చెందాయని గుర్తుచేశారు. అభివృద్ధి ప్రాంతాలుగా తీర్చిదిద్దిన ఆనాటి నాయకులను కొంతమంది అవహేళన చేశారని అన్నారు. దేశంలో ఏ నగరానికి లేనివిధంగా 160 కిలో మీటర్ల మేర ఓఆర్ఆర్ నిర్మించారని సీఎం గుర్తుచేశారు. ఫ్యూచర్ సిటీకి భూమిలిచ్చే రైతులను ఆదుకునే బాధ్యత తీసుకోవాలని అధికారులకు సూచించారు. చట్టపరంగా నోటిఫికేషన్లు, న్యాయపరమైన ప్రక్రియ ఇప్పటికే పూర్తి అయ్యిందన్న ఆయన భూమి ఇవాళ కాకపోతే రేపు అయినా ప్రభుత్వానికి బదిలీ అవుతుందని తెలిపారు. భూమి బదిలీ ఆగే అవకాశం లేదని, తాత్కాలికంగా వాయిదా పడవచ్చని చెప్పారు. ప్రభుత్వం తరపున ప్రక్రియ జరిగినపుడే పరిహారం డబ్బులు తీసుకుంటే మరోచోట తక్కువ ధరకు భూములు వచ్చేవని రైతులనుద్దేశించి సీఎం అన్నారు. ఆలస్యమైతే ఎకరాల్లో భూసేకరణ జరిగితే పరిహారం డబ్బులతో గజాల్లో కూడా వేరే చోట భూమి రాదని పేర్కొన్నారు. బాధితుల పిల్లలకు స్కిల్స్ వర్సిటీలో నైపుణ్య శిక్షణ ఇచ్చే బాధ్యత తీసుకుంటామని, ప్రజాప్రతినిధులు బాధితులతో మాట్లాడి అభద్రతా భావాన్ని తొలగించాలన్నారు. అభివృద్ధికి భూములిచ్చిన రైతులను గౌరవించాలని, స్థానికులు సహకరిస్తే ప్రపంచంలోనే అద్భుత నగరానికి పునాదులు వేగంగా పడతాయని పునరుద్ఘాటించారు.

# భూసేకరణను తక్షణమే చేపట్టాలి

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, చర్లపల్లి, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ల వద్ద అప్రోచ్ రోడ్ల విస్తరణతో పాటు అవసరమైన భూసేకరణను తక్షణమే చేపట్టాలని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన ఒక లేఖ రాశారు. నగరంలోని ప్రధాన టెర్మినల్లపై (కాచిగూడ, సికింద్రాబాద్, హైదరాబాద్) పడుతున్న భారాన్ని తగ్గించేందుకు కేంద్రం చేపడుతున్న పనులకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం చర్లపల్లి నుంచి రాకపోకలు సాగిస్తున్న రైళ్లు, ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిన నేపథ్యంలో మౌలిక వసతుల కల్పన అత్యవసరమని లేఖలో పేర్కొన్నారు. రూ. 430 కోట్ల ప్రాజెక్టు: ప్రత్యామ్నాయ టెర్మినల్‌గా చర్లపల్లి స్టేషన్‌ను కేంద్రం భారీ నిధులతో అభివృద్ధి చేస్తోంది. ఎఫ్‌సీఐ గోడౌన్ రోడ్డు విస్తరణ.. కొత్తగా నిర్మించిన స్టేషన్ భవనం వైపు ఉన్న ఈ రహదారిని ప్రధాన మార్గంగా మార్చేందుకు 200 అడుగుల వెడల్పుతో విస్తరించాలి. భరత్ నగర్ రోడ్డు విస్తరణ.. ఇటువైపు నుంచి స్టేషన్‌కు వచ్చే ప్రస్తుత 30 అడుగుల రహదారిని కనీసం 100 అడుగులకు పెంచాలి. ఈసీ నగర్ మార్గం అభివృద్ధి.. ఎంఎంటీసీ ప్లాట్ ఫాంకు చేరుకునే ఇరుకైన ఈ రోడ్డును కనీసం 100 మీటర్ల వెడల్పుతో, 700 మీటర్ల పొడవున అభివృద్ధి చేయాలి. పార్కింగ్ కోసం ప్రయాణికులు, వాహనాల రద్దీకి అనుగుణంగా కొత్త బిల్డింగ్ వైపు 3 ఎకరాలు, ఎంఎంటీసీ ప్లాట్ ఫాం వైపు 2.70 ఎకరాల అదనపు భూమిని కేటాయించాలి. నీటి కనెక్షన్ కోసం రైల్వే శాఖ ఇప్పటికే ఒప్పందం ప్రకారం రూ. 4 కోట్లు జమ చేసినందున, వెంటనే ఆ పనులు పూర్తి చేయాలి. భవిష్యత్ రద్దీని తట్టుకునేలా అంతర్జాతీయ ప్రమాణాలతో సికింద్రాబాద్ స్టేషన్ ఆధునికీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని మంత్రి గుర్తుచేశారు. రూ. 715 కోట్లతో ఆధునికీకరణ: అత్యాధునిక సౌకర్యాలతో ఈ స్టేషన్ పునరాభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. స్టేషన్ ఉత్తరం వైపు టెర్మినల్‌కు చేరుకోవడానికి ప్రస్తుత రహదారి చాలా ఇరుకుగా ఉంది. ప్రయాణికుల సౌకర్యార్థం ఆల్ఫా హోటల్ నుంచి రాతిఫైల్ బస్టాండ్ వరకు ఉన్న రహదారిని 120 అడుగులకు విస్తరించాలి. ఈ సమస్యలపై ఇప్పటికే రైల్వే, జీహెచ్ఎంసీ, హైదరాబాద్ రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అధికారులు ఉమ్మడిగా క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి నివేదిక ఇచ్చారని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి, ఆ తర్వాత ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి లేఖల ద్వారా ఈ విషయాన్ని తెలిపినా పనులు ఇంకా ప్రారంభం కాలేదని ఆయన పేర్కొన్నారు. నగరానికి అత్యంత కీలకమైన ఈ ప్రాజెక్టుల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా చొరవ తీసుకుని, రోడ్ల విస్తరణ, భూ కేటాయింపులకు తక్షణమే అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు.

# మోడీ రాకతో తెలంగాణలో రాజకీయ మార్పు

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** తెలంగాణలో ప్రధాని మోడీ పర్యటన నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర అగ్రనేతలు సన్నాహక సమావేశం నిర్వహించారు. బహిరంగ సభ ఏర్పాట్లు, జన సమీకరణ అంశాలపై చర్చించారు. సైబరాబాద్, హైదరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ల పరిధిలోని 300 డివిజన్ల నుంచి జనసమీకరణ అంశాలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు మాట్లాడుతూ.. మోడీ మూడోసారి ప్రధాని అయ్యాక మొదటిసారి హైదరాబాద్‌కు వస్తున్నారని చెప్పారు. మోడీ రాకతో రాజకీయ మార్పు మొదలవుతుందన్నారు. పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరిలో బీజేపీనే అధికారంలోకి రాబోతుందని.. భవిష్యత్తులో తెలంగాణలోనూ తమ పార్టీనే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రామచందర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు లక్ష్మణ్, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పాయల్ శంకర్, ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, ఏవీఎన్ రెడ్డి, మల్కా కొమురయ్య, పార్టీ సంస్థాగత ఇన్‌ఛార్జి చంద్రశేఖర్ తివారీ తదితరులు హాజరయ్యారు.

# మండిపోతున్న ఎండలు.. జనం విలవిల

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** రాష్ట్రంలో ఎండలు నిప్పులు కురిపిస్తున్నాయి. వడగాల్పుల తీవ్రతకు జనం విలవిలలాడుతున్నారు. తాజాగా నమోదైన గణాంకాల ప్రకారం, రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రత నిజామాబాద్ జిల్లా మెండోరలో అత్యధికంగా 46 డిగ్రీలుగా నమోదై రికార్డు సృష్టించింది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండల తీవ్రత మరీ ఎక్కువగా ఉంది. డిచ్‌పల్లి (నిజామాబాద్) లో 45.9, సాత్నాల (ఆదిలాబాద్)లో 45.6, బాన్సువాడ (కామారెడ్డి)లో 45.5 డిగ్రీలు నమోదైంది. ఇక హైదరాబాద్ పరిధిలో మేడిపల్లిలో 42.9, అబ్దుల్లాపూర్‌మెట్ లో 42.6, హిమాయత్‌నగర్‌లో 42.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ప్రధానంగా నిజామాబాద్, ఆదిలాబాద్, కామారెడ్డి జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతున్నాయి. ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటుతున్న నేపథ్యంలో మధ్యాహ్నం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రతలు తీసుకోవాలని సూచించారు.



# సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో రూ.11.4 కోట్ల డ్రగ్స్ పట్టివేత

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో భారీగా డ్రగ్స్‌ను పట్టుకున్నారు. 11.4 కిలోల క్రిస్టల్‌మెత్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.11.4 కోట్లు ఉంటుందని తెలిపారు. రైల్వేస్టేషన్‌లో డీఆర్ఐ అధికారులు తనిఖీలు చేపట్టారు. ట్రాలీ బ్యాగులతో అనుమానాస్పదంగా వస్తున్న ఇద్దరు మహిళలను ఆపి తనిఖీలు చేపట్టారు. వారి బ్యాగుల్లో భారీగా డ్రగ్స్ పట్టుబడ్డాయి. దీంతో ఇద్దరిని అరెస్టు చేసి దర్యాప్తు చేపట్టారు. శంషాబాద్ విమానాశ్రయంలో కూడా భారీగా డ్రగ్స్ పట్టుబడ్డాయి. ఎయిర్ ఆసియా విమానంలో బ్యాంకాక్ నుంచి వచ్చిన ఓ ప్రయాణికుడి వద్ద 6.15 కిలోల హైడ్రోఫోనిక్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.2.15 కోట్లు ఉంటుందని తెలిపారు. 16 సీల్డ్ ప్యాకెట్లలో దీనిని తెస్తుండగా తనిఖీలు చేపట్టి అధికారులు పట్టుకున్నారు.

# ఎస్ఐఆర్ పై అనుమానాలు

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** ఎస్ఐఆర్ ప్రక్రియలో కొన్ని అనుమానాలు ఉన్నాయని.. వాటిని సీఈవోకు వివరించామని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ తెలిపారు. మంగళవారం వినోద్‌కుమార్, బీఆర్ఎస్ నేతలు సీఈవో సుదర్శన్‌రెడ్డి, ఇతర అధికారులను కలిశారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్‌పై వారికి వినతిపత్రం అందించారు. అనంతరం వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల శుద్ధి కార్యక్రమం చేపడుతున్నదని.. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి శుద్ధి కార్యక్రమం నడుస్తున్నదని అన్నారు. ఇప్పుడు మళ్లీ కొత్త ఫొటోలు ఇవ్వాలని చెప్తున్నారని.. గ్రామీణ స్థాయిలో ఉన్న వారికి ఎలాంటి అవగాహన లేదని తెలిపారు. బీఎల్ఓలే కాకుండా.. బూత్ లెవెల్ ఏజెంట్స్ కూడా యాక్టివ్‌గా ఉండాలని సూచించారు. కేసీఆర్ సైతం ఇదే అంశాన్ని ప్రస్తావించారని చెప్పారు. జూన్ నుంచి ఎస్ఐఆర్ ప్రారంభం అవుతుందని చెబుతున్నారని.. అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని కోరామని తెలిపారు.

# పెట్రోల్, డీజిల్ ధరలు పెంచే ఆలోచన లేదు

**నేషనల్ బ్యూరో :** ఏప్రిల్ 29న బెంగాల్‌లో పోలింగ్ ముగిసిన తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతారన్న ఊహాగానాలను కేంద్రం తోసిపుచ్చింది. పెట్రోల్, డీజిల్ ధరలు పెంచే ప్రణాళికలు ప్రభుత్వానికి లేవని కేంద్ర ప్రభుత్వ వర్గాలు మంగళవారం తెలిపాయి. "పెట్రోల్, డీజిల్ ధరలను పెంచే ప్రతిపాదన ఏదీ లేదు" అని పశ్చిమాసియా పరిణామాలపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ అన్నారు. బుధవారం బంగాల్‌లో పోలింగ్ ముగిసిన తర్వాత రిటైల్ ఇంధన ధరలను పెంచుతారా అన్న ప్రశ్నకు ఆమె ఈ మేరకు సమాధానమిచ్చారు. డిమాండ్‌ను తీర్చడానికి దేశంలో పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ఎల్‌పీజీ, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ వంటి అన్ని ఇంధనాల నిల్వలు తగినంతగా ఉన్నాయని ఆమె తెలిపారు. పశ్చిమాసియాలో.. నెలకొన్న ఘర్షణల కారణంగా గత రెండు నెలల్లో ముడి చమురు ధరలు 50 శాతానికి పైగా పెరిగినప్పటికీ, రిటైల్ పెట్రోల్, డీజిల్ ధరలు రికార్డు స్థాయిలో వరుసగా నాలుగో ఏడాది కూడా స్థిరంగా ఉన్నాయి. ముడిసరుకుల ధరలకు, పెట్రోల్ పంపు ధరలకు మధ్య పెరుగుతున్న వ్యత్యాసం ప్రభుత్వ రంగ ఇంధన రిటైలర్లకు భారీ నష్టాలను మిగిల్చింది. కొన్ని అంచనాల ప్రకారం రోజువారీ నష్టం సుమారు రూ. 2,400 కోట్లుగా ఉంది. అయితే, బుధవారం తమిళనాడు, బంగాల్, అసోం, కేరళ, పుదుచ్చేరిలో రాజకీయంగా ఉత్కంఠభరితమైన అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత ధరలు తక్షణమే పెరుగుతాయన్న ఊహాగానాలకు ఇది ఆజ్యం పోసింది. మరోవైపు ఈ వదంతులతో ఆంధ్రప్రదేశ్‌లోని అనేక పట్టణాల్లో ప్రజలు భయాందోళనలతో కొనుగోళ్లు చేశారు. ఫలితంగా కొరత ఏర్పడి ఆదివారం 400కు పైగా పెట్రోల్ పంపుల్లో ఇంధనం ఖాళీ అయ్యిందని నివేదికలు చెబుతున్నాయి. పెట్రోలియం మంత్రిత్వ శాఖ ప్రకారం కొన్ని అవుట్‌లెట్లలో డిమాండ్ 3033 శాతం వరకు పెరిగింది. ప్రపంచ ముడి చమురు ధరలు, అంతర్జాతీయ, దేశీయ ఇంధన ధరల మధ్య పెరుగుతున్న వ్యత్యాసాల కారణంగా ఎన్నికల తర్వాత లీటరుకు రూ. 2528 వరకు ధరలు పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు గతంలోనే హెచ్చరించారు.

ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌పై దాడి చేసిన తర్వాత అంతర్జాతీయ చమురు ధరలు ఒక్కసారిగా పెరిగాయి. దీనికి ప్రతిగా ఇరాన్, ప్రపంచంలోని అత్యంత కీలకమైన ఇంధన మార్గాల్లో ఒకటైన హర్మూజ్ జలసంధిని మూసివేసింది. ఈ జలసంధి పర్షియన్ గల్ఫ్‌ను ప్రపంచ మార్కెట్లకు అనుసంధానిస్తూ, ప్రపంచ చమురు వాణిజ్యంలో దాదాపు ఐదో వంతుతో పాటు గణనీయమైన పరిమాణంలో ఎల్‌పీజీని నిర్వహిస్తుంది. ప్రపంచ చమురు ధరలు పెరిగినప్పటికీ, దాదాపు నాలుగేళ్లుగా పెట్రోల్ పంపు ధరలను పెంచకపోవడంతో ప్రభుత్వ రంగ ఇంధన రిటైలర్లు లీటరు పెట్రోల్‌పై సుమారు రూ. 20, డీజిల్‌పై లీటరుకు దాదాపు రూ. 100 నష్టపోతున్నారని అదికారులు చెబుతున్నారు. గతేడాది బ్యారెల్‌కు 70 డాలర్లుగా ఉన్న ముడి చమురు, ఈ నెలలో సగటున 114 డాలర్లకు పైగా ఉంది.




# మహిళా రిజర్వేషన్లపై మా పోరాటం ముగిసిపోలేదు

**నేషనల్ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** మహిళా రిజర్వేషన్ల బిల్లుపై కీలక వ్యాఖ్యలు చేశారు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ. మహిళలకు రిజర్వేషన్ కల్పించే హక్కు అమలు చేసేందుకు తాను సర్వశక్తులూ ఒడ్డుతానని ఆయన మహిళలకు హామీ ఇచ్చారు. ఎన్ని ఆటంకాలు వచ్చినా మహిళా రిజర్వేషన్ అమలు చేయడానికి కృషి చేస్తూనే ఉంటామన్నారు. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ల బిల్లును ప్రవేశపెట్టడానికి తాము ఎంతగానో ప్రయత్నించామని అన్నారు. కాంగ్రెస్, ఎస్పీ వంటి ప్రతిపక్ష పార్టీల నీచ రాజకీయాల వల్లే ఆ చట్టం అమల్లోకి రాకుండా ఆగిపోయిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు అభివృద్ధి చెందడం, అసెంబ్లీలు, పార్లమెంట్‌లకు రావడం ప్రతిపక్షాలకు ఇష్టం లేదని, అందువల్లే 40 ఏళ్లుగా ఈ బిల్లును అడ్డుకుంటూనే ఉన్నారని తెలిపారు. వారణాసిలో నిర్వహించిన సభలో ప్రసంగించిన ప్రధాని మోదీ, తమ తప్పులు కప్పిపుచ్చుకోవడానికి సాకులు వెతుకుతున్నారని అన్నారు. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయడమనే మహా యజ్ఞం ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నానని ప్రధాని మోదీ అన్నారు. అందుకు మాతృమూర్తుల ఆశీస్సులు తీసుకునేందుకు వారణాసి వచ్చానని ప్రధాని పేర్కొన్నారు. ఈ బిల్లును తేవడానికి చేస్తున్న ప్రయత్నాల్లో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని, ఇది రాజకీయ పార్టీల కోసం తెచ్చింది కాదని వ్యాఖ్యానించారు. సాధారణ కుటుంబాల మహిళలు పార్లమెంటు, అసెంబ్లీలకు రావాలని కోరుకున్నానని చెప్పారు. కానీ ప్రతిపక్షాలు మాత్రం అధికారం తమ కుటుంబాలకే పరిమితం కావాలని కోరుకుంటున్నాయని విమర్శించారు. మహిళా రిజర్వేషన్లపై తమ పోరాటం ముగిసిపోలేదని, చట్టాన్ని అమలు చేసే వరకు పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. అంతకుముందు ఉత్తర్‌ప్రదేశ్ ముంబయి మధ్య రైలు అనుసంధానాన్ని పెంచుతూ రెండు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. వారణాసి పర్యటనలో భాగంగా ప్రధాని ఈ రైళ్లను జెండా ఊపి ప్రారంభించారు. వారణాసిపుణె, అయోధ్యముంబయి మార్గాల్లో ఈ రైళ్లు పరుగులు పెట్టనున్నాయి. కొత్తగా ప్రారంభించిన అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల ద్వారా కాశీ విశ్వనాథ క్షేత్రం, అయోధ్య రామ మందిరానికి చేరుకోవడం సులభతరమవుతుందని ప్రధాని మోదీ తెలిపారు. ముంబయి, పుణె వంటి మెట్రో నగరాల నుంచి నేరుగా రైలు సౌకర్యం కల్పించడం వల్ల పర్యాటక రంగానికి భారీ ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. అత్యాధునిక సౌకర్యాలతో పాటు సామాన్యులకు అందుబాటులో ఉండేలా ఈ రైళ్ల రూపకల్పన జరిగినట్లు వెల్లడించారు.

# ప్రపంచ వైద్య పర్యాటక కేంద్రంగా హైదరాబాద్




**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** ప్రపంచ వైద్య పర్యాటక కేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. జూన్‌లో ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజం ఈవెంట్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. ఈవెంట్ నిర్వాహణ కోసం పర్యాటకశాఖతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు ఆరోగ్య, పర్యాటక శాఖ ఉన్నతాధికారులతో సెక్రటేరియట్‌లోని తన చాంబర్‌లో మంత్రి సమీక్ష నిర్వహించారు. మంగళవారం ఉదయం జరిగిన ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి, డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, డాక్టర్ సంగీత సత్యానారాయణ, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ, డాక్టర్ గౌరవ్ ఉప్పల్, ఆరోగ్యశాఖ, పర్యాటక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మెడికల్ టూరిజం అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలు, కలిగే ప్రయోజనాలపై సమావేశంలో చర్చించారు. హైదరాబాద్‌ను ప్రపంచ వైద్య పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన సూచనలను ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. ఇకపై ప్రతి సంవత్సరం హైదరాబాద్‌లో కనీసం ఒక మెడికల్ టూరిజం ఈవెంట్‌ను నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారని, ఇందుకు అనుగుణంగా ఈ ఏడాది జూన్‌లో మొదటి ఈవెంట్ నిర్వాహణకు ఏర్పాట్లు చేయాలని ఆరోగ్యశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ ఈవెంట్‌లో దేశ, విదేశీ వైద్య, ఫార్మా రంగ ప్రముఖులను భాగస్వాములను చేయాలని మంత్రి సూచించారు. మెడికల్ టూరిజంలో ఉన్న ప్రైవేటు సంస్థలను సైతం ఈవెంట్‌లో భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు. ఆఫ్రికా, ఏసియా, మిడిల్ ఈస్ట్ తదితర కంట్రీస్ నుంచి ప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్న 3 టిమ్స్ హాస్పిటల్స్‌లో ఇంటర్నేషనల్ పేషెంట్ సర్వీసెస్ విభాగాలను ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. ఒక్కో హాస్పిటల్‌లో 50 బెడ్లతో ఇంటర్నేషనల్ పేషెంట్స్ వార్డు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దేశ, విదేశాల నుంచి వచ్చే పేషెంట్లతో ప్రభుత్వ హాస్పిటళ్లకు ఆదాయం సమకూరుతుందని, తద్వారా హాస్పిటళ్ల నిర్వాహణ మెరుగుపడి స్థానిక ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుతాయన్నారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో 2322 నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేసిన మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు, ఇటీవలే ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. ఈ ఉద్యోగాలకు ఎంపికైన నర్సింగ్ ఆఫీసర్లకు మే 12వ తేదీన ఇంటర్నేషన్ నర్సెస్ డే సందర్భంగా నియామక పత్రాలు అందజేసేందుకు ఏర్పాట్లు చేయాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ హాస్పిటల్స్, మెడికల్ కాలేజీల్లో జరుగుతున్న పోస్టుల భర్తీపై సమావేశంలో చర్చించారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ హాస్పిటల్స్‌లో భర్తీ చేస్తున్న సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్, ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో భర్తీ చేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు.. అలాగే, ఫార్మసిస్ట్ పోస్టులు, మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ పోస్టుల భర్తీ ప్రక్రియపై మంత్రి ఆరా తీశారు. మే 15వ తేదీ నాటికి అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తి చేసి, ఫలితాలు విడుదల చేస్తామని అధికారులు మంత్రికి తెలిపారు. ఫార్మసిస్ట్, మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ పోస్టుల భర్తీలో నెలకొన్న లీగల్ చిక్కులను పరిష్కరించి, భర్తీ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ రెండేళ్లలో సుమారు 12,650 పోస్టులను భర్తీ చేశామని, మిగిలిన పోస్టుల భర్తీ ప్రక్రియ కూడా పూర్తయితే. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుతాయని మంత్రి పేర్కొన్నారు.

# ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** ఎంపీడీవో కార్యాలయంలో అభివృద్ధి సంక్షేమ పథకాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా సాగి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సరైన అవగాహన కల్పించాలని, కొనుగోలు ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కేంద్రాన్ని వ్యవసాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు పర్యవేక్షిస్తూ సమస్యలు వెంటనే పరిష్కరించేలా చూడాలని తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా మిషన్ భగీరథ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట బావులను అద్దెకు తీసుకుని నీటి సరఫరా చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని, ఇసుక కొరత రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. జూన్ 2 నాటికి అధిక సంఖ్యలో గృహప్రవేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరచాలని, డ్రాప్‌అవుట్స్ లేకుండా చూడాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచాలని పేర్కొన్నారు. రాబోయే వర్ష కాలాన్ని దృష్టిలో ఉంచుకొని మొక్కలు నాటేందుకు ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు. ఆయిల్ పామ్ సాగుపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని, దీని ద్వారా లభించే లాభాలు వివరించాలని ఉద్యాన శాఖ అధికారులకు మంత్రి తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఆర్ & బి, పంచాయతీ రాజ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, అవసరమైన చోట చెక్‌డ్యామ్‌లు, ఫీడర్ చానళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిస్తూ మహిళా సంఘాలకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు వినియోగంలోకి తేవాలని సూచించారు. ఉపాధి హామీ పథకం లక్ష్యాలు గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ, ఎల్కతుర్తి మండలం లో 13 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోళ్లు జరుగుతున్నాయని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలిస్తున్నామని తెలిపారు. ధాన్యం తరలింపులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఎంపీడీవో విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎల్కతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సంతాజీ, ఆర్టీఓ రాథోడ్ రమేష్, జడ్పీ సీఈవో శేషాద్రి, డీఆర్‌డీఓ మేన శ్రీను, డీపీఓ లక్ష్మీ రమాకాంత్, ఆర్ & బీ ఈఈ సురేష్ బాబు, జిల్లా సహకార అధికారి సంజీవ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వాజిద్ అలీ, ఏడీఏ ఆదిరెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.



స్నేహిత ఎక్స్ ప్రెస్
29-04-2026
బుధవారం
హైదరాబాద్
expresstelugudaily.com

# కంగ్టిలో పలు శుభకార్యాల్లో పాల్గొన్న పి.చంద్ర శేఖర్ రెడ్డి





**- ఎంపీ సురేష్ శెట్కర్, సతీమణి ఉమాదేవి శెట్కర్ తదితరులు**

**కంగ్టి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం కంగ్టి మండల పరిధిలోని నాగన్ పల్లి గ్రామ ఆప్తులు శివాజి రావు (బాబు పటేల్ ) గారి కూతురి పెళ్లి వేడుక బస్వా ప్రదీప్ ఫంక్షన్ హాల్ కంగ్టి లో పాల్గొని నూతన వధువరులకి ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల చంద్ర శేఖర్ రెడ్డి..వారితో శివాజి పాటిల్ సర్పంచ్. కుర్తె శ్రీనివాస్ రెడ్డి, విఠల్ రావు పాటిల్ మాజీ సర్పంచ్ బాణపురం రాజు ముదిరాజ్,మహేష్ చవాన్ కౌన్సిలర్స్ కుర్మ నర్సిములు, జైరాజ్ మాజీ సర్పంచ్, మారుతీ రావు వెంకట్ రావు,కాశినాథ్ సెట్,ఆకుల రాములు,తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. అనంతరం కంగ్టి మండల గ్రామ ఆప్తులు అస్టూర్ నర్సప్ప మరియు ఏడురే గుండప్ప కుర్మ గార్ల కూతుర్ల పెళ్లి ప్రథనం పాల్గొని నూతన వధువులకి ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.వారితో పాటు శివాజి పాటిల్ సర్పంచ్, కుర్తె శ్రీనివాస్ రెడ్డి,విఠల్ రావు పాటిల్,మాజీ సర్పంచ్ బాణపురం రాజు,ముదిరాజ్,మహేష్చవాన్,కౌన్సిలర్స్ కుర్మ నర్సిములు,సాయిలు, తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# వేసవిలో త్రాగునీటి ఎద్దడి లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి





**జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**నారాయణఖేడ్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** వేసవి సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ఎక్కడా తాగునీటి కొరత తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. ప్రతి నివాస ప్రాంతానికి నిరంతర తాగునీటి సరఫరా జరిగేలా ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని సూచించారు. మంగళవారం నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలోని మండలాల ఎంపీడీవోలు, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, ఎంపీఓలు, మున్సిపల్ కమిషనర్, విద్యుత్, తదితర శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంచినీటి సరఫరా, ఇందిరమ్మ ఇండ్లు, శానిటేషన్, సాదా బైనామాలు, భూభారతి దరఖాస్తుల పరిష్కారం వంటి అంశాలపై వివరంగా చర్చించారు. మండలాల వారీగా గ్రామాల్లో నీటి సరఫరా పరిస్థితి, అందుబాటులో ఉన్న నీటి వనరులు, మరమ్మతులు అవసరమైన పనులపై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత వేసవిలో సమస్యలు ఎదురైన ప్రాంతాలను గుర్తించి, ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. చుక్క నీరు కూడా వృథా కాకుండా సమర్థవంతంగా వినియోగించుకోవాలని, ప్రతి ఇంటికి తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే ముందుగానే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి, యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని సూచించారు. అలాగే అన్ని గ్రామ పంచాయతీలలో పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా అమలు కావాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ పరిధి స్పష్టంగా తెలిసేలా ప్రతి గ్రామ పంచాయతీకి సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని ఎంపీడీవోలకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, లబ్ధిదారులను ప్రోత్సహిస్తూ పనులు త్వరగా పూర్తి చేసేలా చూడాలని, బిల్లులు ఆలస్యం లేకుండా వెంటవెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ అధికారులకు ఆదేశించారు. సాదా బైనామాలు, భూభారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని రెవిన్యూ అధికారులకు సూచించారు.విద్యుత్ శాఖకు సంబంధించి లో వోల్టేజ్, ట్రాన్స్ఫార్మర్లు, లైన్ల మరమ్మత్తులు వంటి సమస్యలను 15 రోజుల్లోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, మున్సిపల్ కమిషనర్,ఎంపీడీవోలు,తహసీల్దార్లు, ఎంపీఓలు,విద్యుత్, హౌసింగ్, మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలి





**జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**నారాయణఖేడ్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పేర్కొన్నారు. మంగళవారం నారాయణఖేడ్ మండలం తుర్కపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో నిర్వహణ విధానాన్ని సమగ్రంగా పరిశీలించారు. రిజిస్టర్లు తనిఖీ చేయడంతో పాటు ల్యాబ్, ఫార్మసీ తదితర విభాగాలను పరిశీలించారు.ఆసుపత్రికి వచ్చిన రోగులతో కలెక్టర్ మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. గర్భిణులతో ప్రత్యేకంగా మాట్లాడి, వారికి అందుతున్న వైద్య సేవలు, చెకప్‌లు క్రమం తప్పకుండా జరుగుతున్నాయా అనే విషయాలను తెలుసుకున్నారు. ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా, అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయా అనే అంశాలపై సంబంధిత అధికారులను ప్రశ్నించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు మరియు ఇతర అత్యవసర మందులు అందుబాటులో ఉన్నాయని మెడికల్ ఆఫీసర్ తెలిపారు. ప్రతి రోజు ఇన్‌పేషెంట్స్, ఔట్ పేషెంట్స్ సంఖ్య, గర్భిణీల చెకప్‌లు, అందుబాటులో ఉన్న పరీక్షలు, ప్రతి నెల జరిగే ప్రసవాల సంఖ్య తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించడం ద్వారా ప్రజల్లో విశ్వాసం పెంపొందించాలన్నారు. ముఖ్యంగా సాధారణ ప్రసవాల సంఖ్య పెరిగేలా వైద్యులు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఉమా హారతి, ఎంపీడీవో, మెడికల్ ఆఫీసర్,తదితరులు పాల్గొన్నారు.

## రేగోడ్, పెద్ద శంకరంపేటలో

# అక్రమ మద్యం రాజ్యం

- గల్లీ గల్లీ బెల్ట్ షాపుల జాలం! కోడి కూయకముందే
- తెరుచుకుంటున్నబెల్ట్ దుకాణాలు
- అధికారుల మౌనం వెనుక మామూలు మత్తు?
- ఆప్కారి శాఖ అధికారులకు మూడు పువ్వులు ఆరు కాయలుగా నడుస్తుంది వ్యవహారం




**రేగోడ్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** రేగోడ్,శంకరంపేట మండలాల్లో అక్రమ మద్యం వ్యాపారం అదుపుతప్పుతోంది. గ్రామాలు, తాండాలలో బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా విస్తరించి, మద్యం ఏరులై పారుతోంది. ఎక్కడ చూసినా ఇళ్లలోనే బార్‌ల తరహాలో మద్యం అందుబాటులో ఉండటం ఆందోళన కలిగిస్తోంది. నిబంధనల ప్రకారం వైన్ షాపులు, బార్లు సమయపాలన పాటించాల్సి ఉండగా, బెల్ట్ షాపులు మాత్రం 24 గంటలూ తెరుచుకుని అక్రమ విక్రయాలు జరుపుతున్నాయి. కోడి కూయకముందే ప్రారంభమయ్యే ఈ దుకాణాలు అర్ధరాత్రి దాకా నిరభ్యంతరంగా కొనసాగుతున్నాయి. గ్రామాల్లోనే కొద్దిపాటి అదనపు ధర చెల్లిస్తే ఏ బ్రాండ్ మద్యం అయినా సులభంగా లభిస్తోందని స్థానికులు చెబుతున్నారు. క్వార్టర్‌పై రూ.10 నుంచి రూ.20 వరకు అదనంగా వసూలు చేస్తూ అక్రమంగా దోపిడీ జరుగుతోందని ఆరోపణలు ఉన్నాయి. ఇంకా ఆందోళనకర విషయం ఏమిటంటే..బెల్ట్ షాపుల్లోనే సిట్టింగులు ఏర్పాటు చేసి, బార్ అండ్ రెస్టారెంట్‌ల మాదిరిగా చికెన్, మటన్, గుడ్లు, ఆమ్లెట్ వంటి ఆహార పదార్థాలు అందిస్తున్నారు. దీంతో యువత మద్యం వైపు మరింతగా ఆకర్షితమవుతున్నారు.వైన్ షాపుల నుంచే ఆటోలు, ద్విచక్ర వాహనాలపై కాటన్‌ల కొద్దీ మద్యం బెల్ట్ షాపులకు తరలిస్తున్నా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎక్సైజ్ శాఖ పూర్తిగా నిద్రావస్థలో ఉందని ప్రజలు మండిపడుతున్నారు.ఇంకా, కర్ణాటక నుంచి కల్తీ మద్యం తెచ్చి విక్రయిస్తున్నారన్న ప్రచారం స్థానికుల్లో భయాందోళనలకు దారితీస్తోంది. ఇలాంటి మద్యం వల్ల ప్రజల ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం పడే ప్రమాదం ఉన్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఫిర్యాదు చేయడానికి ప్రయత్నించినా పోలీసు, ఎక్సైజ్ అధికారులు ఫోన్‌లు కూడా లిఫ్ట్ చేయరని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మామూళ్ల పేరుతో అక్రమాలకు అండగా నిలుస్తున్నారన్న అనుమానాలు బలపడుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని బెల్ట్ షాపుల దందాను అరికట్టాలని ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

# ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున మండల ప్రజలకు పలు సూచనలు

**వైద్యాధికారి బి.నాగమణి**



**కంగ్టి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం కంగ్టి మండల కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ బి నాగమణి మాట్లాడుతూ ప్రస్తుత వేసవిలో ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున ప్రజలు వడదెబ్బల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ముఖ్యంగా ఉపాధి హామీ పనులకు వెళ్లే కూలీలు తలపై రుమాలు, లేదా చున్నీ కప్పుకొని వెళ్లాలని, వీలైనంత త్వరగా పనులు ముగించుకొని ఉదయం 11 గంటలలోపు ఇంటికి చేరుకోవాలని కోరారు. పనిచేసే సమయంలో అధిక చెమటలు పట్టడం, తల తిరగడం, జ్వరం వచ్చినట్లు అనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే విశ్రాంతి తీసుకొని తడి బట్టతో శరీరాన్ని చల్లబరచుకోవాలని తెలిపారు. వేసవి సెలవుల సందర్భంగా చిన్న పిల్లలను అనవసరంగా ఎండలోకి పంపవద్దని, బయటకు వెళ్లాల్సి వస్తే తలపై రుమాలు లేదా టోపీ పెట్టాలని తల్లిదండ్రులకు సూచించారు. ఆయా గ్రామాల్లో ఆశా వర్కర్ల ద్వారా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు, రోజుకు కనీసం ఐదు లీటర్ల వరకు నీరు తీసుకోవడం మంచిదని చెప్పారు. ఎండల కారణంగా ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలి పై విషయాలు మండల ప్రజలు తుచతప్పకుండ పాటించాలని కోరారు.

# స్వీయ గణనతో సమయాన్ని ఆదా చేసుకోండి

**ప్రజలకు మోమిన్‌పేట్ తహశీల్దార్ రవీందర్ పిలుపు**

**మోమిన్‌పేట్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** జనాభా లెక్కలు-2027లో భాగంగా ప్రవేశపెట్టిన స్వీయ గణన (సెల్ఫీ ఏనుమేరేషన్) విధానాన్ని ప్రజలు విస్తృతంగా వినియోగించుకోవాలని మోమిన్‌పేట్ తహశీల్దార్ రవీందర్ పిలుపునిచ్చారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి ప్రజలే తమ కుటుంబ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే ఈ సౌకర్యం ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా తహశీల్దార్ రవీందర్ మాట్లాడుతూ..ప్రజలు ప్రభుత్వంపై ఆధారపడకుండా, స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకోవడం ద్వారా సమయాన్ని ఆదా చేసుకోవచ్చు. ఇది పారదర్శకతను పెంచడంతో పాటు, గణన ప్రక్రియను వేగవంతం చేస్తుంది" అని పేర్కొన్నారు.స్వీయ గణన కోసం ప్రత్యేక వెబ్‌సైట్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందని, అందులో కుటుంబ పెద్ద మొబైల్ నంబర్‌తో ఓటీపీ ద్వారా లాగిన్ అయి, జిల్లా, గ్రామం/పట్టణం, పిన్ కోడ్, ఇంటి లొకేషన్ వంటి వివరాలను నమోదు చేయాలని సూచించారు. గృహానికి సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి, వివరాలను సమర్పించిన తర్వాత ప్రత్యేకంగా "ఈఎస్ఈఐడి" లభిస్తుందని చెప్పారు. మే 11 తర్వాత ఇంటికి వచ్చే గణన అధికారికి ఈఎస్ఈఐడి చూపిస్తే నమోదు ప్రక్రియ సులభంగా పూర్తవుతుందని వివరించారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఈ కార్యక్రమం విజయవంతమవుతుందని, ప్రతి కుటుంబం బాధ్యతగా స్వీయ గణనలో పాల్గొనాలని తహశీల్దార్ రవీందర్ విజ్ఞప్తి చేశారు."మన సమాచారం - మన చేతుల్లోనే" అనే భావనతో ప్రజలు ముందుకు రావాలని అధికారులు ఆకాంక్షిస్తున్నారు.



